క్లుప్తంగా

మండల యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం



దేవరాజులనాయుడు, అరుణ్‌కుమార్

ఐరాల: మండల యూటీఎఫ్ శాఖ మండల కౌన్సిల్ సమావేశం గురువారం పాలకల జెడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమశేఖర్‌నాయుడు ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించి మండల యూటీఎఫ్ శాఖలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా దేవరాజులనాయుడు, గౌరవ అధ్యక్షుడిగా ప్రభాకర్, అసోసియేట్ అధ్యక్షులుగా లీలావతి, జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా అరుణ్‌కుమార్, కోశాధికారిగా సుధాకర్, మండల కార్యదర్శులుగా గుణసుందరి, నాగరాజు, విజయలక్ష్మి, అమ్ములు, జిల్లా కౌన్సిలర్లుగా రామచంద్రనాయుడు, వెంకటముని, సోమశేఖర్‌నాయుడు, ఏకాంబరం, సెల్ కమిటీ సభ్యులుగా త్రివేణి, కుసుమకుమారి, ఆడిట్ సెల్ కమిటీ సభ్యులుగా సరోజమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాణిపాకంలో వనమహోత్సవం

కాణిపాకం: దేవదాయశాఖ ఆదేశాల మేరకు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో గురువారం వన మహోత్సాన్ని నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్ దేవత వృక్షాలు నాటారు. కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

లేఖ రచన పోటీలు

చిత్తూరు కార్పొరేషన్: తపాలా శాఖ ఆధ్వర్యంలో లేఖ రచన పోటీల్ని నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ లక్ష్మణ తెలిపారు. 'ది జాయ్ ఆఫ్ రైటింగ్' ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్ అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, భాషలో రచన చేయాలన్నారు. 18 ఏళ్లలోపు వారికి, 18 ఏళ్లు పైబడిన వారికి వేర్వేరుగా ఇన్‌ల్యాండ్ లెటర్ కార్డ్ కేటగిరీ, ఎన్వలప్ కేటగిరీలో పోటీలు ఉంటాయన్నారు. లేఖలను ఈ ఏడాది డిసెంబరు 14లోగా చిత్తూరు ప్రధాన తపాలా కార్యాలయానికి పంపాలని ఆయన వివరించారు.

కలవకుంట జలాశయం పరిశీలన


నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు–పెనుమూరు మార్గంలో ఉన్న కలవకుంట జలాశయాన్ని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ గురువారం పరిశీలించారు. నగర వాసులకు ఇక్కడి నుంచి తాగునీటిని పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పూనేపల్లె వద్ద పంప్ హౌస్‌లో మోటార్లను పరిశీలించారు. మరమ్మతులు ఉంటే ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. నీటి శుద్ధిని పరిశీలించి, పలు సూచనలు చేశారు.

వరిలో సస్యరక్షణ పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బంగారుపాళెం: వరిసాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని చిత్తూరు డాట్ సెంటర్ ప్రతినిధి డాక్టర్ సంధ్యారాణి సూచించారు. మండలంలోని సదకుప్పంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వరి పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. జింక్ లోప నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఉద్యాన పంటల సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. వ్యవసాయానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏఓలు చిట్టిబాబు, పద్మజ, హెచ్ఓ సాగరిక, ఏఈఓ సాదరయ్య, గోవిందు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి


వైద్య శిబిరంలో డాక్టర్ చంద్రమోహన్

గుడిపాల: వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమోహన్ అన్నారు. వసంతాపురం విలేజ్ క్లినిక్‌లో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ చంద్రమోహన్ 55 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలను ఇచ్చారు. వైద్యసిబ్బంది జబసెల్వి, ఉమామహేశ్వరి, సరస్వతి, చంద్రశేఖర్, సుజిమ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు: మహాలక్ష్మిగా అమ్మవారు, బంగారుపాళెం: శ్రీబాల త్రిపుర సుందరిగా వజ్రాలపురం గంగమ్మ, ఐరాల: స్వర్ణకవచంలో పాలేటమ్మ, గుడిపాల: మహాలక్ష్మిగా మూలస్థాన దుర్గమ్మ







చిత్తూరు: అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బొమ్మల కొలువు

దసరా సంబరం.. ఆరంభం

- అమ్మవారి ఆలయాల్లో వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- రోజుకో రూపంలో దర్శనమివ్వనున్న అమ్మవారు


చిత్తూరు: దుర్గాంబకు పూజలు చేస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక మండపాల్లో అమ్మవారు కొలువుదీరి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించనున్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిత్తూరు నగరంలోని పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నవరాత్రి పూజలను ప్రారంభించారు. చిత్తూరు నగరం గిరింపేటలోని దుర్గాంబను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. 108 బిందెలతో పాలాభిషేకం చేశారు. 1008బిందెలతో జలాభిషేకం చేశారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం మహాచండీయాగం శాస్త్రోక్తంగా జరిపించారు. రాత్రి మహాలక్ష్మీ అవతారంలో అమ్మవారు అభయమిచ్చారు. గుర్రప్పనాయుడు వీధిలోని అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పుష్పాలంకారం, శ్రీ లక్ష్మీ అలంకారంలో అమ్మవారు కనువిందు చేశారు. బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయిబాబా ఆలయంలో మహాలక్ష్మీ అలంకారంలో దుర్గామాతను కొలువుదీర్చారు. తేనెబండలోని ముత్యాలమ్మ మహాలక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దేవతమూర్తులకు మొక్కులు తీర్చుకున్నారు.

వజ్రాలపురం బోయకొండలో...

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం దసరా, దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయం ఆవరణలో గణపతి హోమం, కలశపూజ చేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం వజ్రాలపురం బోయకొండ గంగమ్మ శ్రీబాల త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీవజ్రాలపురం గంగమ్మ రోజుకో రూపంలో అలంకార భూషితులై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని తెలిపారు. ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, చాతుర్య పురుషోత్తం, దీప, గోపి, ఉషా, నరేష్ ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మేనేజర్ మొగిలప్ప పాల్గొన్నారు.

చందనాలంకారంలో ముత్యాలమ్మ

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ముత్యాలమ్మ గురువారం చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని చందనంతో అలంకరించి దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామంలోని ఓంశక్తి ఆలయం, ఓటీకే వీధిలోని సత్యమ్మ ఆలయం, మొగిలి వెంకటగిరిలోని గంగమ్మ ఆలయాల్లో దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

ఐరాల: మండలంలో దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో వెలసిన గ్రామ దేవత పాలేటమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మొదటి రోజు సాయంత్రం పాలేటమ్మ స్వర్ణకవచం అలంకారంలో భక్తులకు కటాక్షించారు. వైఎస్.గేటులో చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉదయం ధ్వజారోహణం, గణపతి హోమం, కలశారాధన పూజలు చేశారు. సాయంత్రం చాముండేశ్వరి అమ్మవారు బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. భక్తులకు పసుపు, కుంకుమ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయదారులుగా విజయనాథ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మట్టపల్లె గ్రామస్తులు వ్యవహరించారు.

బాలాత్రిపుర సుందరిగా గంగమ్మ

గుడిపాల: మండలంలోని శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. పల్లూరులోని గంగమ్మ దేవాలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం గంగమ్మ బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కందగిరి కొండ వద్ద ఉన్న శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవాలయంలో ఉన్న మూలస్థాన దుర్గమ్మ అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. కుంకుమ అర్చన కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో తపాలా సిబ్బంది నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా సిబ్బంది

బంగారుపాళెం: తమ సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం మండల కేంద్రంలోని తపాలాశాఖ కార్యాలయం ఎదుట పోస్టల్ సిబ్బంది నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పోస్టల్‌శాఖలో లక్ష్యాలకు వ్యతిరేకంగా ఏఐజీడీఎస్ యూనియన్ పిలుపు మేరకు రెండో దశ పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం నుంచి శనివారం వరకు నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌పోస్టుమాస్టర్ మహేష్, ఏఐజీడీఎస్ యూనియన్ డివిజన్ కార్యదర్శి అరుణ, రామాంజనేయులు, పాండు, రవి, కుమారి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో పొంచి ఉన్న ప్రమాదం అన్న శీర్షికన గత నెల 25వ తేదీన సాక్షిలో కథనం వెలువడింది. వీధి మధ్యలో విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉండడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. గురువారం స్థానిక సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది మైఖేల్, మహేష్, సతీష్ పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించి ఆ స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటుచేశారు.



పాత విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం, కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఈదురు గాలులు.. భారీ వర్షం.. పంట నష్టం


యర్లంపల్లెలో నేలకొరిగిన వరి పంట


టి.పుత్తూరు దగ్గర నేలకొరిగిన పశుగ్రాసం

ఐరాల: మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. పగటి సమయంలో భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. సాయంత్రం ఒక్క సారిగా వాతావరణం మారిపోయింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీరు వారపు సంతలోకి రావడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ప్రజలు ఒక్కసారిగా పరుగులు తీశారు. అడవిలో భారీ వర్షం కురవడంతో మండల కేంద్రంలోని గార్గేయ నది ప్రవహించింది. 35 యర్లంపల్లెకు చెందిన హేమంత్‌రెడ్డి సాగు చేసిన వరి పంట ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి నేలకొరిగింది. ఈ వర్షం వేరుశెనగ పంటకు అనుకూలమని రైతులు చెబుతున్నారు. పగటి సమయంలో భానుడి ప్రతాపానికి విలవిల్లాడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి ఊపిరి పీల్చుకున్నారు.

120.8 మిల్లీమీటర్ల వర్షపాతం

మండలంలో బుధవారం రాత్రి 120.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని గురువారం ఏఓ వరలక్ష్మి తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క రాత్రిలో ఇంత భారీ వర్షం కురిసిన దాఖలాలు లేవని ప్రజలు చెబుతున్నారు. రెండు గంటలపాటు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

36.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

తవణంపల్లె: మండలంలో బుధవారం రాత్రి పెనుగాలులతో కూడిన రాళ్ల వర్షం కురిసింది. ఇటీవల వర్షాలు పడక ఎండుముఖం పట్టిన పంటలు ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంటలకు కళవచ్చింది. మండలంలో 36.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెనుగాలులతో గ్రామాల్లో చెట్లు విరిగి కరెంటు తీగలపై పడడంతో కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ అధికారులు విరిగిన చెట్లను తొలగించి గురువారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షం పడడంతో వేరుశనగ పంట ఒబ్బిడి చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఇంటింటికీ వైద్యం పేదలకు వరం



నలిశెట్టిపల్లెలో వైద్యసేవలందిస్తున్న వినయ్‌కుమార్, జొన్నగురకలలో సేవలందిస్తున్న మోహన్‌వేలు

తవణంపల్లె: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వైద్య సేవలందించడం పేదలకు వరమని మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని జొన్నగురకల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 35 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. వర్షాకాలంలో కాంచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. జ్వరం సోకిన, వాంతులు, విరేచనాలు అయిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలన్నారు. గ్రామంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జాహ్నవి, ఏఎన్ఎం వేదవతి, డీఈఓ విజయలక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

జొన్నగురకలలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని నలిశెట్టిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ గ్రామంలోని పేదలకు ఆరోగ్య సూత్రాలు గురించి వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. అనంతరం రోగులకు, గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు సలహాలిచ్చారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథ మహిళకు అంతిమ సంస్కారాలు


అనాథ మహిళ మృతదేహాన్ని తీసుకెళుతున్న ముస్లిం జేఏసీ సభ్యులు

బంగారుపాళెం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని మహిళకు గురువారం పోలీసులు అంతిమ సంస్కారాలను నిర్వహించారు. గత నెల 28న మండలంలోని మొగిలి ఘాట్‌లో లారీ ఢీకొని ఆ మహిళ మృతి చెందింది. మృతురాలి చిరునామా తెలుసుకునేందుకు పోలీసులు పలు ప్రాంతాల్లో ఆరా తీసినా ఫలితం లేకపోయింది. గుర్తు తెలియని మహిళకు సంబంధించిన వారు ఎవరైనా వస్తారేమోనని మృతదేహాన్ని బంగారుపాళెం మార్చురీలో నాలుగు రోజుల పాటు భద్రపరిచారు. మృతురాలి చిరునామా లభించలేదు. మృతురాలి మెడలో నల్లపూసల దండ ఉండడంతో ముస్లిం మహిళగా భావించి మండల ముస్లిం జేఏసీ సహకారంతో స్థానిక జామియా మసీదు శ్మశానంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లప్ప, ముస్లిం జేఏసీ అధ్యక్షుడు ఫిరోజ్, సభ్యులు సమీర్, రియాజ్, లాలూ, షంషీర్, అంబులెన్స్ బాషా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు బాగున్నాయి


ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పూతలపట్టు: సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు బాగున్నాయని జిల్లా వైద్య ఆరోగ్య సమన్వయాధికారి ప్రభావతి తెలిపారు. మండలంలోని పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె రోగులతో వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులతో మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మరింత వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కుమారరాజ, శారద, నర్మద, శ్రావణ్ పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపునకు క్షేత్రస్థాయి శిక్షణ



శిక్షణలో పాల్గొన్న పీసీఆర్ పాఠశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: పాఠశాల స్థాయి విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పూర్వాణి తెలిపారు. ఈ మేరకు ఆ పాఠశాల విద్యార్థులకు ఒకేషనల్ ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్ పై క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు దసరా సెలవుల్లో ఒకేషనల్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సంతపేటలోని బేకరీలో కేక్స్, జామ్, జెల్లీ, ఇతర వస్తువుల తయారీ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ వనిత పాల్గొన్నారు.

కుక్కలు.. జనం బెంబేలు

- గ్రామాల్లో విచ్చలవిడిగా స్వైర విహారం
- పట్టించుకోని అధికారులు


బంగారుపాళెంలో గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

బంగారుపాళెం: గ్రామ సింహాలు (ఊర కుక్కలు) ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. మాంసం, చికెన్, చేపల దుకాణాలు, కోళ్ల ఫారాలు ఉన్న ప్రదేశాల్లో వీధి కుక్కలు మకాం వేసి తమ సంతతిని పెంచుకుంటున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రజలపై వీధి కుక్కల దాడులు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. దాడుల్లో గాయపడిన వారు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్స చేయించుకుంటున్నారు. గత 9 నెలల్లో నియోజకవర్గంలో 125 మందికి పైగా కుక్క కాటుకు గురయ్యారు.

కుక్కకాటుపై నిర్లక్ష్యం వద్దు

వీధి కుక్కలతో పల్లె ప్రజలు హడలిపోతున్నారు. నియోజకవర్గంలోని పూతలపట్టు, ఐరాల, తవణంపల్లె, బంగారుపాళెం, యాదమరి మండలాల్లోని గ్రామాల్లో ఏ వీధికి వెళ్లినా వీధి కుక్కలు పదుల సంఖ్యలో కనిపిస్తాయి. రహదారులు, మాంసం, చికెన్, చేపల దుకాణాల వద్ద వీటి సంచారం ఎక్కువగా ఉంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు, విద్యార్థులు, పిల్లలు, మహిళలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. అయితే కుక్కేకదా కరిచింది..తినే ఆహారంలో పత్యం పాటిస్తే సరిపోతుందిలే అనుకుంటే ప్రాణాలు పోగొట్టుకునే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాహనదారులు, విద్యార్థులు, ప్రయాణికులపై వీధి కుక్కల దాడులు ఈ మధ్య కాలంలో అధికమయ్యాయి. వీధుల్లో సంచరిస్తున్న కుక్కల కారణంగా గ్రామీణ ప్రాంతల్లో ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో వీధుల్లో సంచరిస్తూ అరుపులతో ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు, కోళ్లపై కుక్కలదాడులు పెరిగిపోతున్నాయి.

రేబిస్ వ్యాధి లక్షణాలు

- జ్వరం, వాంతులు, విరేచనాలు, తలనొప్పి, గొంతునొప్పి వస్తుంది
- ఫిట్స్, కాళ్లూ చేతులు పడిపోవడం (పక్షవాతం), కోమాలోకి వెళ్లడం, పిచ్చి పిచ్చిగా మాట్లాడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- క్యాన్సర్, మధుమేహం వ్యాధిగ్రస్తులు 28వ రోజున వ్యాక్సిన్ డోస్ తీసుకోవాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కుక్క కరిచిన వెంటనే సబ్బుతో గాయాన్ని శుభ్రం చేసి, దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలి.
- యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.
- గాయానికి ఎప్పటికప్పుడు శుభ్రం చేసి కట్టుకట్టుకోవాలి.
- ఏఆర్‌వీ వ్యాక్సిన్ 0, 3,7, 14 రోజుల చొప్పున తీసుకోవాలి.
- కుక్క కాటుకు ఆహార నియమాలేవీ లేవు.
- కరచిన కుక్కను 10 రోజులపాటు గమనించాల్సి ఉంటుంది.
- కుక్క ఆరోగ్యంగా ఉంటే గాయపడిన వారు భయపడనక్కర్లేదు.

పరిసరాల శుభ్రత అవసరం

గుడిపాల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వలన ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించవచ్చన్నారు.కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ, మానవహారం, ర్యాలీని నిర్వహించారు. కళాశాల వ్యవస్థాపకులు లోకేష్, ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్ పాల్గొన్నారు.


స్వచ్ఛత కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి